# పొగ మంచు


కె. సదాశివ రావు

రిటైరైపోయి మనవలతో ఆడుకునే వయసులో చిన్ననాడు' తన హైస్కూలు రోజుల్లో తన నో ఆట ఆడించిన అల్లరి పిల్ల అమ్మమ్మలా ఎదిగిపోయి ఎదురొస్తే... కార్తీక మాసపు చల్లని అందాల వెన్నెల లాటి ఆ అనుభవాన్ని అక్షరాల్లో కరిగించి పోసిన కథ ఇది.

హైదరాబాదులో ఉంటున్న మే మందరమూ కలిసి ఎగ్జిబిషన్‌కి పోదామని ఇంట్లో అందరూ పోరుతుంటే చివరికి ఓ సాయంత్రాన బయలుదేరి వెళ్లాము. నేనూ, మా ఆవిడా, మా పెద్దబ్బాయి, వాడి భార్య, మనవరాలూ, మా చిన్నవాడూ... అంధరం కలిసి వెళ్లాం. జనవరి రోజులు... చలి చల్లగా ఉంది.

లైట్ల కాంతిలో... వచ్చిన జనసమూహాలతో రేగిన దుమ్ము... వివరీతమైన కోలాహలంతో... ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ హడావిడిగా ఉంది. రంగు రంగుల స్టాల్స్... రకరకాల వస్తువులు... వేలాది జనం... చెవులు గల్లుపడే శబ్ద కాలుష్యం...

ఇంత జనంలోనూ దారి తప్పితే మళ్లీ వెతుక్కోవడం మరో న్యూసెన్స్ కాబట్టి, ముందుగానే మేము హెచ్చరిక చేసుకున్నాము.




అందరం కలిసి తిరుగుతున్నాము. నా మనవరాలు నా చేయి పట్టుకుని నడుస్తోంది.

మా ఆవిడ ముందే ఏవేం కొనవలసిందీ జాబితా వేసేసింది. ఈ లిస్టు తయారీకి మా కోడలితో ఓ మీటింగ్ పెట్టి అన్ని నిర్ణయాలూ తీసుకున్న దనుకుంటాను. నాకేం కావాలో ఆవిడకి ఎలాగూ తెలును. ఆ లిస్ట్ ప్రకారం స్టాల్స్‌కి వెళ్లి సేల్స్ వాళ్లతో బేరమాడి, దెబ్బలాడి మొత్తానికి ఏవేవో కొంటున్నారు. వాటిలో బట్టలు, వంటింటికి పనికి వచ్చే వస్తువులూ, ముఖ్యంగా చీరలు, జాకెట్ పీసులు, పంచెలూ, లుంగీలూ, తువ్వాళ్లు, బెడ్ షీట్లు, కర్టెన్ గుడ్డలు... చవగ్గా ఉన్న వాటిని కాస్త నాణ్యం చూసి కొన్నారు.

కాలం గడిచిన కొద్దీ మా చేతుల్లో బరువులు పెరిగిపోతున్నాయి. అందరం ఏదో ఓ పార్శిల్ మోస్తున్నాము, మా మనవరాలు చిన్నితో సహా. అది తన పరికిణీ గుడ్డలూ, బెలూన్ల పొట్లం, ప్లాస్టిక్ సంచీలో గర్వంగా మోస్తూ తిరుగుతోంది. కొంతం పూర్తయ్యాక అందరం కలిసి మిగిలిన స్టాల్స్‌లోకి వెళ్లి మన దేశ పారిశ్రామిక ప్రగతికి ప్రతీకలుగా వివిధ శాఖలు ఉంచిన రంగు రంగుల ఫోటోలనీ, గ్రాఫుల్నీ ఛార్ట్స్‌నీ చూసి ఆనందించి బయటకు వచ్చాము.

చివరికి కాళ్లు పీకి అందరం కలిసి ఫెర్రిస్ వీల్ దగ్గర చేరాము. మా చిన్నవాడు అందరికీ కూల్ డ్రింకులు తెచ్చి ఇచ్చాడు. కబుర్లు చెప్పుకుంటూ ఎగ్జిబిషన్ హడావిడిని చూస్తూ తాగుతున్నాము.



అంత గొడవలోనూ ఓ పెద్ద గొంతుకతో ఎవరో అన్నారు.

"ఏవిటీ వెంకటేశంవేనా?"

ఆ గొంతుక ఎందుకనో ఎక్కడో విన్నట్లుగా అనిపించింది నాకు.

తిరిగి ఆ కేక వచ్చిన వేపుకి చూసేసరికి ఓ లావుపాటి ఆవిడ నాకేసి తరిచి తరిచి చూస్తున్నది. నేను తల తిప్పుకున్నాను. 'ఎవరిని చూసి ఎవ రనుకుంటోందో పాపం' అనుకున్నాను.

లౌడ్ స్పీకర్లలో ప్రకటనలు... సినిమా పాటలు... ఆ రొదలో... ఆ లైట్ల వెలుతురులో...

"ఇం కెవరు! వెంకటేశంవే! యావండోయ్ ఇలా రండి" అని గావుకేక పెట్టింది.

మా చిన్ని ఉలిక్కిపడింది.

"ఎవరు తాతయ్యా ఈవిడ? ఇలా అరుస్తోంది?"

"ఏమో తల్లీ!" అన్నాను.

"ఏమిటే? ఏమిటీ నీ గొడవ" భర్త కాబోలు ఆమెను అడుగుతున్నట్లున్నాడు.

"ఏం లేదండి. మీకు చెబుతుండేదాన్ని - మా క్లాస్‌మేట్ గురించి?"


"ఏ క్లాస్‌మేట్?"

"నాతోపాటు స్కూల్ ఫైనల్ దాకా చదివాడండి. అడుగో అతడే!"

ఎవరో మన కెందుకు అని మాటలు వింటూ నేను స్టాల్స్ కేసి, తిరుగుతున్న జనం కేసి చూస్తున్నాను. మా ఆవిడా, కోడలూ ఊసులాడుకుని, జోకులు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. అవి ఇన్-జోక్స్. మనకి ఛస్తే చెప్పరు.

"ఏమండీ! మీ పేరు వెంకటేశ్వర్రావేనా?"

పొట్టిగా, లావుగా ఉన్న ఓ బట్టతల పెద్దమనిషి దగ్గర కొచ్చి నన్నడిగాడు. ఇదేదో తమాషాగా ఉంది. నిజానికి నా పేరు అదే.




'ఎవ రీయన? ఎందు కిలా అడుగుతున్నాడు' అనుకున్నాను.

"నా పేరు వెంకటేశ్వర్రావేనండి."

"మీరు గుంటూరు హైస్కూల్లో చదివారా?"

అదేం ప్రశ్న? నాకు నవ్వొచ్చింది. చెప్పొద్దూ. రిటైరై రెండేళ్లయిన వాడిని హైస్కూలు రోజుల గురించి అడుగుతున్నారు. వీ ళ్లెవరు? ఏమిటీ పిచ్చి ప్రశ్నలు?

"చదవటం మాట నిజమే ననుకోండి... ఎప్పుడో నలభై ఏళ్లనాటి మాట. ఇంతకీ మీకేం కావాలి?"

"ఏం లేదు. మా ఆవిడ మీ క్లాస్‌మేట్ నంటుంది. ఇదిగో సుబ్బులూ, ఇలారా!"

ఆవిడ గబగబా వచ్చింది. ఆమె జుట్టు పూర్తిగా నెరిసిపోయి ఉంది. బాగా రేగి ఉంది. ముఖాన పెద్ద బొట్టు... అలసటతో, చిరుచెమటతో... కొద్దిగా చెరిగి ఉంది. ఖరీదైన వెంకటగిరి చీర, మెడలో నగ లున్నాయి. ఆమె ముఖంలో, పెద్ద కళ్లలో వెల్లివిరిసిన ఆనందం. ఎవరో పెద్ద ఇంటి ఇల్లాలు అనుకున్నాను.

"నే చెప్పలేదటండీ. నాకు బాగా గుర్తు. జ్ఞాపకశక్తి విషయంలో మీలా కాదు. ఇంతకీ మరిచేపోయాను. ఎలాగున్నావోయ్ వేరుశనక్కాయ్?" అంది హాయిగా నవ్వుతూ.

నా గుండె ఝల్లుమంది.

ఆ మాట ఆవిడ కంఠం నుండి ఊడి పడగానే ఎన్నో దశాబ్దాలనాటి బాల్యంలో జరిగిన సంఘటనలు నా అంతరంగ సముద్రంలో ఉవ్వెత్తున అలల్లా లేచి నా మనో మందిరంలో ఆహ్లాదకరంగా ఆట లాడాయి.

"మీరా సుబ్బులక్ష్మి!" అన్నాను.

లైట్ల వెలుతురులో ఆమె కళ్లలో మెరుపు.

ఎన్నేళ్లనాడు!?

వేరే జన్మలోనేమో ననిపించింది.

నేను కూడా ఓ స్టూడెంట్‌గా, అల్లరిగా, పైలాపచ్చీస్‌గా తిరిగే రోజుల్లో... బాధ్యత ల్లేకుండా... పుస్తకాలు చదవడం తప్ప మరో వ్యాపకం లేని... ఏదో విచిత్రమైన మంత్రలోకంలో ఉన్నట్లుగా...

క్లాసులు... పాఠాలు... స్నేహితులు... అల్లరి... పరీక్షలు... కలలు... తప్ప వేరే ఏమీ తెలియని మాజిక్ రోజుల్లోకి నేను వెళ్లిపోయాను.

అప్పుడూ, ఇప్పుడూ కూడా స్వతహాగా నేను నెమ్మదస్తుడిని... భయస్తుడిని... పిరికి పాలు కాస్త ఎక్కువ... నేను క్లాసులో అల్లరి చేసి ఎరుగను. 'మంచి బాలుడు రాము'' అని నా మిత్రులు వేళాకోళం చేసేవారు.

చదువంటే శ్రద్ధ... మేస్టర్లంటే భయభక్తులు.

నా మిత్రులలో చాలామంది ఇతర వ్యాపకాలతో తీరుబడి లేకుండా ఉండేవారు. ఆటలు ఆడేవాళ్లూ... పాటలు బాగా పాడేవాళ్లూ... కృష్ణశాస్త్రి కవిత్వం చదివి గిరజాలు పెంచుకుని కళ్ల నిండా కలలు నింపుకునే కుర్ర భావకవులూ... మరో ప్రపంచం కోసం కలవరించే శ్రీశ్రీ అభిమానులూ... అందరూ ఉండేవారు ఆ రోజుల్లో...

దొంగతనంగా సిగరెట్లూ, బీడీలూ తాగి పెద్దవాళ్లయినట్టుగా ఫీలయేవాళ్లూ... యాంగ్రీ యంగ్‌మెన్... రొమాంటిక్... ఉత్త రౌడీ వెధవలూ... అందరూ ఉండేవారు.

సుబ్బలక్ష్మి మేజిస్ట్రేటుగారి కూతురు. గడుగ్గాయి. బాగా అల్లరి చేసేది. అందరికీ ఏవేవో పేర్లు పెట్టి ఉడికించేది. కాని, తన నేమైనా అంటే బ్రహ్మరాక్షసిలా పోట్లాడేది. "బుద్ధావతారం వస్తున్నాడేవ్" అనేది నన్ను చూసి. ఆమె స్నేహితురాళ్లు నవ్వేవారు.



నగం అవుతుంది

**డాక్టరు:** *ఇలా అయితే లాభం లేదండీ! మీరు రోజూ మార్నింగ్ వాక్ చేయాలి.*

**స్థూలకాయుడు:** *నేను .లేచేసరికి మార్నింగ్ నగం అయిపోతుంది, సార్!*

మంత్రి ఉమామహేశ్వరరావు [గుంటూరు]

ఆ పిల్లంటే అందరికీ సింహస్వప్నం!

మాటకి మాట అనేది. గయ్యాళిలా మగరాయుడిలా ప్రవర్తించేది. ఒక్కతే కూతురేమో బాగా గారాబం చేసి పెంచినట్లుగా ఉంది. చదువులో చురుగ్గానే ఉండేది. ఎంతసేపూ ఆ పిల్ల దృష్టి మగపిల్లలను ఎలా ఉడికించాలా అన్నదే. 'యాడమ్ టీజింగ్'లో ప్రథమురాలని నా ఉద్దేశ్యం.

ఇంగ్లీషులో పోట్లాడేది.

తనకి తెలియకుండానే మగవాళ్లతో సమానంగా స్త్రీ హక్కుల ఉద్ధరణకి పోటీ పడుతున్నట్లుగా ఉండేదని ఇప్పుడు నాకు అనిపిస్తున్నది. ఇతర ఆడపిల్ల లెవ్వరయినా ఏడిపించినట్లుగా కానీ, కించిత్తు అల్లరి పెట్టినట్లుగా కానీ ఆమెకు తెలిస్తే స్వయంగా రంగంలో దిగిపోయి, అల్లరి పెట్టిన వాడి భరతం పట్టేది. రౌడీ రాలుగాయి లాంటి ఆ పిల్లంటే స్కూ లంతటికీ హడల్.

బొద్దుగా, సంక్రాంతి రోజులలోని బంతిపూల రథంలా, నవ్వుల తోటలా... అల్లరి వన కిన్నెరలా... తళుక్కున మెరిసే చిలిపి రవి కిరణంలా ఉండేది.

ఆమె ఎవ రెవరు రౌడీ వెధవల్ని ఎలా పరాభవం చేసిందీ కథలుగా చెప్పుకునేవారు.

ఓసారి హేమంతుగాడు సుభాషిణి మీద పెన్నుతో ఇంకు చిలకరించితే సుబ్బలక్ష్మి వాడు క్లాసులో కూచుని ఉండగా వాడి నెత్తిన ఓ ఫుల్ ఇంక్ బాటిల్ వొంపేసింది. వాడు ఇంటికి పోయాక అభ్యంగనస్నానమూ, ఆపైన వాళ్ల నాన్న చేత చచ్చే తన్నులూ వరసలో జరిగాయి.

అందుకే ఆ పిల్లంటే గౌరవం కన్నా భయమే ఎక్కువ మా కందరికీ. బరి తెగించిన ఆడపిల్ల... మగాళ్లతో సమంగా మాటకు మాట అని పోట్లాడే ఆ పిల్లకు నేను ఎంతో దూరంగా ఉండేవాడిని.

నా చదు వేమిటో, నా గో లేమిటో తప్ప నాకు వేరే వ్యాపకా లేమీలేవు.

నా ఖర్మగాలి నేను ఆ పిల్ల కళ్లబడ్డాను. అప్పటినుండీ నా వెంట పడింది.

నా అందం చూసి ఆకర్షణకి లోనయిందేమో నన్న అనుమానం కొద్ది రోజులు పీడించేది. లోపల్లోపల ఈ ఊహ ఎంతో సంతోషాన్ని కలిగించేది కూడాను. ఈ సంగతు లేమయినా మా నాన్న చెవిన పడితే ఇంక అంతే సంగతులు. చెమడా లెక్కవేయడం... వీపు విమానం మోత మోగించడం... గూబలు గుయ్యి మనటం... ఇవన్నీ చకచకా జరిగిపోవటం ఖాయం.

"తెలుగు నోట్స్ బుక్ ఓసారి ఇస్తావా" అని అడిగితే, నేను భయంతో, బిడియంతో బిగుసుకుపోయాను.

"నే చదువుకోవాలి" అన్నాను.

"ఒక్క రోజులో నీ పుస్తకం ఏదో అరిగిపోదులే, రే పిచ్చేస్తాగా" అని డబాయించినట్లుగా అడిగింది.

'భగవంతుడా!' అని లోపల ప్రార్థన చేసుకుంటూ "నా దగ్గర లేదు" అబద్ధ మాడేను.

"అదే చేతిలో" అని లాక్కుంది.

ఖర్మగాలి ఆ పుస్తకం నిజంగానే నా చేతిలో

ఉన్నది.

"ఫరవాలేదు భయపడకు. రే పిచ్చేస్తాను." వెళ్లిపోయింది.

మర్నాడు తిరిగి ఇచ్చివేసిం దనుకోండి. అది వేరే విషయం.

నా ఫ్రెండ్స్ నన్ను అల్లరి పట్టించేవారు.

"ఏంరేయ్, లంకిణి నీ వెంట పడిందా? ఏం కథ?"

"ఏం లేదు."

"చెప్పరా, సిగ్గుపడకు."

నేను ఈ గొడవతో, ఆ పిల్ల అల్లరితో కొంచెం చదువులో వెనకబడిన మాట వాస్తవమే. ఆమె గురించి కాస్త ఆలోచించేవాడిని.

అవి యౌవనపు తొలి రోజులు...

నూనూగు మీసాలు...

శరీరంలో మార్పులు వస్తున్న రోజులు...

ఏవేవో తెలియని భావాలు...

సెన్సేషన్స్ వచ్చే రోజులు...

మానసికంగా, శారీరకంగా మార్పులు వస్తున్న రోజులు...

నేను ధైర్యం చేసుకుని ఓ రోజు ఆమెకు చెప్పేశాను.

"చూడూ - నాతో మాట్లాడకు. మా ఫ్రెండ్స్ నన్ను వేళాకోళం చేస్తున్నారు. ఇలాగైతే అల్లరైపోతుంది."

"ఎందుకు అల్లరైపోతుంది? ఏం చేశామని?" నిలదీసి అడిగింది. ఏం చెప్పాలో నాకు తోచలేదు.

నిజంగా ఆమెలో ఏమీ కల్మషం లేదు. ఆమె కళ్లు నిర్మలంగా కాంతులు వెదజల్లుతున్నాయి. ఆమె అమాయకురాలు. పసితనం ఇంకా పోలేదు. మనసు పరిణతి చెందకుండా బాల్యం వీడని పరిస్థితి ఆమెది అని అర్థమయింది.

"మన మేం చేశామని అల్లరి? ఎవరు అలా మాట్లాడారో చెప్పు" అని నిలదీసింది.

ఒకవేళ పేర్లు చెబితే నా మిత్రుల మీద దాడి చేసి పోట్లాట వేసుకుంటుందేమో నన్న భయం.

"ఎందుకు చెప్పండి, అనవసరంగా గోల అవుతుంది. మా నాన్నగారికి తెలిస్తే ఊరుకోరు."

"ఓహో! అదా సంగతి?" అని కిలకిలా నవ్వింది. "మీ నాన్నగారంటే భయ మన్నమాట?"

"ఏం నీకు భయం లేదా?"


"లేదు! నాకేం భయం లేదు. నేనేం చేశానని భయపడాలి" అని ఎదురు ప్రశ్న వేసింది. నేను సమాధానం చెప్పలేకపోయాను.

వెకిలి నవ్వులు నవ్వుకుంటూ మా గాంగ్ కుర్రాళ్లు రావడం చూసి నేను చరచరా క్లాస్ రూమ్‌కి వెళ్లిపోయాను. పాఠం చదువుతున్నట్లుగా నటిస్తూ కూచున్నాను. వెధవ లేం చేస్తారో నన్న బెదురు. రానే వచ్చేశారు.

"ఏరా, ప్రవరా! వరూధి నేమంటూంది?" అన్నాడు ప్రసాదరాయుడు. వీడికి కవిత్వ మంటే ప్రాణం. ఓ పిల్ల కవి కూడాను.

"ఏం లేదురా. ఆ పిల్ల మంచిదే. ఉత్త బోళా మనిషి."

"ఆ పిల్లా? నీ కేమన్నా పిచ్చెక్కిం దేమిట్రా చదువుల పక్షీ! రౌడీ రంగమ్మ... సూపర్




సుబ్బులక్ష్మి... లంఖిణీ... హిడింబి... లాంటిది నీకు మంచిదీ... బోళాదీలాగా కనిపిస్తున్న దన్నమాట. వ్యవహారం చాలా దూరం వచ్చిందే!" అన్నాడు.

"బాబ్బాబు, నన్ను వదలండిరా. పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. చాలా పోర్షన్‌లు పూర్తి కాలేదు" అని బ్రతిమాలి మొత్తుకున్నాను.

"ఈ వ్యవహార మేమిటో అంతు చూడాలిరా" అన్నాడు రామిరెడ్డి.

"వ్యవహారం లేదూ, గాడిద గుడ్డూ లేదు" అన్నాను కోపంగా.

"మరి నీ నోట్స్ పుస్తకాలే అడగటం... నీతోనే మాట్లాడటం... నిన్ను మాత్రం ఏమీ అల్లరి పెట్టకుండా ప్రవర్తించటం వింతగా ఉంది. మమ్మల్నందరినీ వెంగళప్పల్లా ట్రీట్ చేసే పిల్ల నీతో అలా నైస్‌గా మాట్లాడటంలోని రహస్యం ఏమిటి? చెప్పరా చెప్పు" అని నిలదీశారు.

"రహస్యం లేదు, మీ ముఖం లేదు. నన్ను వదలండిరా వెధవల్లారా" అని లేచి వెళ్లిపోయాను.

వెనక మావాళ్ల వెకిలి నవ్వులు, కామెంట్స్ వినబడ్డాయి.

నేను చదువులో మునిగిపోయాను. నాకు మంచి మార్కులు వచ్చేవి. ర్యాంక్ కోసం చదవడం నాకు మొదటి నుండీ అలవాటే.

ఎక్కడో మనసులో సుబ్బులక్ష్మి ఉండిపోయింది. ఆమె నవ్వులు... చూపులు... మాటలు... గుర్తు వస్తుండేవి.

నా సైన్స్ రికార్డులు అందంగా ఉంటాయని ప్రతీతి. మాస్టర్లు మెచ్చుకునేవారు కూడాను.

"చూడు వెంకటేశం. నీ సైన్స్ రికార్డ్ ఓసారి ఇస్తావా. సోమవారం ఉదయం తెచ్చి ఇచ్చేస్తాను" అని అడిగింది సుబ్బులక్ష్మి ఓనాడు.

చచ్చాన్రా భగవంతుడా! మళ్లీ మొదలయింది భాగోతం అనుకున్నాను.

"నీ రికార్డేమయింది?"

"పూర్తిగా రాయలేదు. అందరూ నీలాగా చదువుతారని ఎందు కనుకుంటావు? నా రికార్డ్‌లో చాలా పేజీలు మిగిలిపోయాయి. రాసుకుని ఇచ్చేస్తాను."

ఆమె అర్థింపులో దైన్యం ఉంది. అసహాయత ఉంది. పాపం నిజంగానే రాయలేదేమో ననుకున్నాను.

వెనకనుండి వెకిలి నవ్వులు, పిల్లి కూతలు వినిపించాయి.

"ఇవ్వను, సారీ!" అని చరచరా వెళ్లిపోయాను.

అంతే ఆమె నామీద పగపట్టినట్లుగా కనిపించేది. అవకాశం వచ్చినప్పుడల్లా ఆడపిల్లల గుంపులో ఉండి ఏవో కామెంట్స్ చేసేది. వాళ్లు విరగబడి నవ్వేవారు.

ఓ రోజు నేను సైన్స్ లాబరేటరీ ప్రక్కనున్న వరండాలో నడుస్తుండగా నా నెత్తిమీద నీళ్లు పడ్డాయి. అవి లాబ్ కిటికీలో నుండి వచ్చాయి.

ఆడపిల్లలు నవ్వుతున్నారు. ఇంతలో సుబ్బులక్ష్మి కిటికీలో కనిపించింది.

"చూడలేదు. బీకర్‌లో నీళ్లు విదిలిస్తే నీమీద పడ్డాయి. సారీ!" అంది.

నాకు ఒళ్లు మండింది. జుట్టు మీద నీళ్లు తుడుచుకుని మనసులో తిట్టుకుంటూ వెళ్లిపోయాను. ఎలాగైనా ఆ పిల్లని అవమానం చేయాలని పట్టుదల పెరిగింది.

ఎలా? ఎలా?


ఓ ప్లాన్ ఆలోచించాను.

ఆ రోజు వేరుశనక్కాయల పొట్లాం తెచ్చి గింజలు తిని తొక్కలు పొట్లాంలోనే ఉంచి చేతిలో పట్టుకుని ఉన్నాను.

ఇంకా కొద్ది వారాల్లో సంవత్సరం అయిపోతుంది. స్కూలు ఫైనల్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి.

పరీక్షలకి ముందు సాంస్కృతిక ఉత్సవాలు. ఆ పైన పరీక్షలు...

త లంటుకుని, మంచి బట్టలు కట్టుకుని ఒంటరిగా వస్తున్నది సుబ్బులక్ష్మి. నేను మెట్ల దగ్గర రెడీగా ఉన్నాను. ఆమె మెట్ల క్రిందకి రాగానే నేను సిద్ధంగా ఉంచుకున్న వేరుశనగ తొక్కలని ఆమె నెత్తిమీద గుమ్మరించాను. గలగలా తొక్కలు ఆమె నెత్తిమీద పడి జారి క్రింద పడ్డాయి. ఒకటో రెండో జుట్టులో ఇరుక్కుంటే ఆమె తీసి పారేసి నా వంకకు చూసింది. ఆ చూపులో షాక్!




ఏమీ అనకుండా హెడ్‌మాస్టర్ గదివేపు వెళ్లింది. వరండాలో ఎవరూ లేరు. పాఠాలు చదివే వాళ్లు క్లాస్ రూముల్లో, జులాయి లంత గ్రౌండ్‌లో ఉన్నారు. ప్యూన్ చంగయ్య మాత్రం ఏవో రిజిస్టర్స్ తీసుకుని టీచర్స్ రూమ్‌కేసి వెళుతున్నాడు.

హెడ్‌మాస్టర్ గదిలో సుబ్బులక్ష్మి ప్రవేశించింది. కంప్లెయింట్ చేస్తోంది.

నా గుండెల్లో రాయి పడింది...

ఇది నాన్నకి తెలిస్తే...

చంపేస్తారు...

భగవంతుడా ఏది దారి?

నన్ను స్కూల్లోంచి పంపివేయడం ఖాయం.

ఇన్నాళ్లూ కష్టపడి సంపాదించిన మార్కులు... నిద్ర లేకుండా కంఠతా పెట్టిన పద్యాలు... తల కెక్కించుకున్న ఎన్నో పాఠాలు... అన్నీ వృథా...

స్కూల్లో డిసిప్లిన్ లేని రౌడీ వెధవని తీసేసినట్లు తీసేస్తారు. వేరే స్కూళ్లలో సీట్లు ఇవ్వకుండా అందరికీ తెలియజేస్తారు - రౌడీ వెధవ ఆడపిల్ల మీద అఘాయిత్యం చేసి స్కూల్లోంచి వెళ్లగొట్టించుకున్నాడు అని. చదువూ సంధ్యా లేకుండా ఎందుకూ పనికిరాని వాడినయిపోతాను.

ఇక బ్రతకడం వ్యర్థం.

దుఃఖం ముంచుకొచ్చింది.

గొంతు పూడిపోయింది.

ఇంతలో సుబ్బులక్ష్మి హెడ్ మాస్టర్ గదిలో నించి బయటకు వచ్చింది. మరో ఇద్దరు అమ్మాయిలు ఆమెతో కలిసి వస్తున్నారు.

నేను దూరం నుండి చూస్తున్నాను.

నామీద కంప్లెయింట్ చేసే ఉంటుంది.

ఇంకో రెండు నిముషాల్లో ప్యూన్ చంగయ్య వచ్చి పిలుస్తాడు.

ఉగ్రుడైన హెడ్ మాస్టర్ రాఘవయ్యగారు బెత్తంతో ముందు చావగొట్టి ఆపైన రస్టికేట్ చేసిన ఆర్డర్ చేతి కిస్తారు.

నా గుండె దడదడా కొట్టుకోవడం మొదలుపెట్టింది.

ఆకాశం బ్రద్దలై నా మీద విరుచుకు పడుతుండగా నా కాళ్ల క్రింద భూమి కదిలిపోతుండగా... నా గుండెలో పదునైన గునపాలు దిగుతుండగా... సుబ్బులక్ష్మి నా దగ్గరకి వచ్చింది. నేను భయంతో కళ్లు మూసుకుని ప్రార్థిస్తున్నాను.

అప్పుడు ఆమె అంది.

"వేరుశనక్కాయ్!"

అందరూ నవ్వారు.

"మీరు వెళ్లండే. నేను ఇప్పుడే వస్తాను. ఇతడితో ఓ విషయం తేల్చుకోవాలి."

నవ్వుకుంటూ ఆమె ఫ్రెండ్స్ వెళ్లిపోయారు.

"నామీద కోపం తీరిందా?" అంది నవ్వుతూ.

"హెడ్ మాస్టారికి చెప్పేశావా?"

"హెడ్ మాస్టారితోనా?" అంది ఆశ్చర్యంగా.

"అవును, నీ నెత్తిమీద వేరుశనగ తొక్కలు పోశానని నామీద కంప్లెయింట్ ఇవ్వలేదా?"

"ఎందు కిస్తాను? ఆ రోజు పొరపాటున నీమీద నీళ్లు పోసినందుకు నీకు నామీద కోపం రాలేదూ? అదీ ఇంతే. తేడా ఏమిటంటే నీవు నామీద కోపంతో పగ తీర్చుకున్నావు. నాకు నీమీద కోపం అసలే లేదు."

ఆమె మాటలు వింటుంటే నాకు ఈ లోకం మీద అమిత ప్రేమ పుట్టింది. మనుమ లందరూ దేవతలే ననిపించింది. నా ముందు నిలబడి ఉన్న సుబ్బులక్ష్మి ఓ పెద్ద దేవతలా కనిపించింది.

హమ్మయ్య. గుండె నిండా గాలి పీల్చుకున్నాను.

"నాది తప్పే సుబ్బులక్ష్మీ!"

కిల కిల నవ్వింది.

"అందుకే ఇకనుండి నిన్ను వేరుశనక్కాయ్ అని పిలుస్తాను. చెప్పడం మరిచిపోయాను. మన స్కూలు వార్షికోత్సవానికి నా భరతనాట్య ప్రదర్శన ఉంది. నేను రెండేళ్లుగా డాన్స్ నేర్చుకుంటున్నాను. బయట ప్రదర్శన ఇవ్వటం ఇదే మొదటిసారి. మీ రంతా గేలి చేసి నవ్వనంటే ప్రదర్శన ఇస్తాను. ముఖ్య అతిథిగా రావడానికి మా నాన్నగారిని హెడ్ మాస్టారు అడిగారు. ఆయన ఒప్పుకున్నారు. ఇప్పుడు ఒక ప్రక్క పాఠాలు చదువుకోవాలి. ఒళ్లు హూనమయ్యేలా ప్రాక్టీస్ చెయ్యాలి. నీవేమో నీ నోట్సూ, పుస్తకాలూ ఇవ్వవు" అంది - ఆందోళన పడుతున్నట్లు మొహం పెట్టి.

"నీ క్కావలసిన పుస్తకాలు తీసుకో ఇస్తాను" అన్నాను గబగబా.

"నాకెం అక్కర్లేదు. నేను రికార్డు పూర్తి చేశాను. అంటే నీ రికార్డంత అందంగా ఉండదనుకో. అసలు నా హాండ్ రైటింగ్ బావుండదు. ఏం చేయను... ఇక ఆలస్య మవుతుంది" అని వెళ్లిపోయింది.

వెళుతున్న ఆ పిల్ల వంక గౌరవంతో, ఆరాధనతో చూశాను. ఏమాత్రం కుత్సితం లేని ఆ పిల్లని ఎలా అర్థం చేసుకోవటం!

ఆ దృశ్యం నేను మరిచిపోలేనిది.

మళ్లీ ఇన్నేళ్ల తర్వాత...

అనాటి బొండుమల్లె లాంటి పిల్ల ఇప్పటి తల్లి... అమ్మమ్మ...

ఆమె వృద్ధాప్యంలో హుందాతనం ఉంది.

ఇంకా మొగుణ్ణి అల్లరి పెట్టి టీజ్ చేసి జీవితంలో మాధుర్యాన్నీ సంసారంలోని రసరమ్యతనీ అందించే భార్యలా... బాధ్యత ఉన్న తల్లిలా... అనురాగఝరి లాంటి అమ్మమ్మలా...

అందంగా... దర్జాగా... చిలిపిగా... ఆనందంతో...

సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉన్న ప్రౌఢ మహిళలా ఉంది.

పరిచయాలు పూర్తయ్యాయి.

ఆమెకు ముగ్గురు పిల్లలు. పెద్దవాడూ, అతడి భార్య - ఇద్దరూ అమెరికాలో డాక్టర్లు. పెద్ద అమ్మాయి, భర్తా యూనివర్సిటీలో పని చేస్తున్నారు. మూడో కూతురు కంప్యూటర్స్‌లో ఎం. ఎస్. అమెరికాలో చేస్తోంది. ఆ పిల్లకి మరో ఇంజనీరు ఉద్యోగితో పెళ్లి కుదిరింది. వచ్చే వేసవిలో పెళ్లి చేయాలి.

వాళ్లతో ఉన్న పిల్ల పెద్దమ్మాయి కూతురు. వీళ్ల దగ్గరే పెరుగుతోంది. భర్త సైంటిస్ట్‌గా బొంబాయిలో పని చేసి రిటైరై రెండేళ్లయింది. హైదరాబాదులో సొంత ఇంట్లో సెటిల్ అయారు.

"ఏమిటోనండి తమాషాగా కలిశాం" అంది మా ఆవిడ.

"వెంకటేశం! నీలో పెద్దరికం వచ్చింది కాని అంత మార్పు రాలేదు. అందుకే గుర్తు పట్టగలిగాను. మీకు తెలీదు లెండి. మా చిన్నప్పుడు ఈయన చాలా అందంగా ఉండేవాడు. బాగా చదివేవాడు. ఆడపిల్ల లందరం ఇతగాడి వెంట పడేవాళ్లం ఆ రోజుల్లో."

"అయితే చిన్నప్పుడు ఈ తాతయ్య నీ బోయ్ ఫ్రెండా అమ్మమ్మా!" అంది పిడుగులాంటి ఆమె మనవరాలు.

"అవునే" అం దామె హాయిగా నవ్వుతూ.

"మేం తెగ పోట్లాడుకునే వాళ్లం."

"ఎందుకని అమ్మమ్మా చెప్పవూ?"

ఆమె భర్త చిరునవ్వుతో సౌమ్యంగా చూస్తున్నాడు. ఆయన కళ్లలో... అవ్యాజమైన అనురాగం... అన్నేళ్ల సాహచర్యంలోని మాధుర్యం... ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

"నీతో పోట్లాట్టం కష్టం కదా సుబ్బులూ! అనుభవంమీద చెబుతున్నానోయ్!"

"అమ్మమ్మతో పోట్లాడి ఎప్పుడు గెలిచావు తాతయ్యా? ఎప్పుడూ ఓడిపోవటమే" అంది

రాలుగాయి చిన్న సుబ్బులు.

"నిజమేనే. చతురురాలు మరి మీ అమ్మమ్మ."

"చాల్లెండి. మీ గడుసుతనం మీరూను. అయితే నేను గయ్యాళిని, మీరు నోరు లేనివారు నన్నమాట. సరిపోయింది."

"మొన్న శేమగాడేం చేశాడో తెలుసా అమ్మమ్మా? నా జడ లాగాడు."

"నువ్వేం చేశావమ్మా!" అడిగాను నేను.


"ఊరుకుంటానేం? వొక్క టిచ్చుకున్నాను" అంది పిల్ల. అచ్చు అమ్మమ్మ పోలికే అనుకున్నాను.

"నిజం చెబుతున్నాను ఏమనుకోకండి" అందామె మా ఆవిడతో.

"ఏమిటండీ?"

"చిన్నతనంలో మీ ఆయనంటే మా క్లాస్‌మేట్సంతా పడి చచ్చేవాళ్ల మనుకోండి."

నేను సిగ్గు పడ్డాను. కించిత్తు గర్వం కూడాను.



"పెళ్లి చేసుకోపోయా రటోయ్?"

"మీకు రాసిపెట్టి ఉంటే అదెలా సాధ్యం? నన్ను కట్టుకుని నన్ను భరించమని ఆ బ్రహ్మదేవుడు రాశాడు మరి" అంది హాయిగా నవ్వుతూ.

"బ్రతికించావు సుబ్బులూ! నీ మాటే కరెక్టు. ఇక వెళదామా? లేటవుతుంది."

"నరేనండి, వెళ్లొస్తాం, వెంకటేశం! మీ శ్రీమతినీ, పిల్లల్నీ ఇన్నేళ్ల తర్వాత చూడటం ఎంత ఆనందంగా ఉందో తెలుసా? ఓసారి మా ఇంటికి రండి. విజయనగర్ కాలనీలో పద్దెనిమిదో నంబర్ ఇల్లు మాది. తప్పక రావాలి" అని మా ఆవిడ దగ్గర మాట తీసుకుంది.

ఇద్దరు ముసలమ్మలూ ఒకరి నొకరు చూసుకున్నారు. వారిలో స్నేహ భావం కనిపించింది.

"వస్తామండీ! తప్పకుండా రావాలి, మరిచిపోవద్దు."

మా దారిన మేం వస్తుండగా మా ఆవిడ అంది...

"అదేమిటండీ ఆవిడ. మరీ బరి తెగించినట్లుగా ఆ మాటలు?"

"ముసలమ్మ సరసాలకి ఇంత పట్టిం పెందుకు" అన్నాను.

"మీకు సరదానే పాపం!" అంది వెక్కిరింతగా.

"ఏం ఉండకూడదా?"

"సడేలెండి. పదండి. ఆటోలు దొరక్కపోతే ఇక సరసా లాడుకుంటూ మలక్‌పేట వెళ్లాలి. ఒరేయి చినబాబూ! ఆటో మాట్లాడరా!" అని తరిమింది వాడిని.

ఒక్కోసారి యాదృచ్ఛికంగా ఏవో జరిగి సామాన్యపు రొటీన్ జీవితాలకి థ్రిల్ ఇచ్చి మరపురానిదిగా మనసులో మిగిలిపోయే అరుదైన రోజు అది. జరిగిన కాలమంత ఎత్తుపల్లాలతో, ఒడిదుడుకులతో... మంచీ చెడులతో... సుఖ దుఃఖాలతో... రంగు రంగుల మిశ్రమంలా కలిసిన ఎమోషనల్ ఇంద్రధనస్సులా విస్తరించి నా మనస్సు నిండిపోయింది.

జీవితంలో మధుర రసం జాలువారిం దా సమయాన.

ఎగ్జిబిషన్‌లో జనం పలుచబడ్డారు.

పొగమంచు దట్టంగా మాయలా పరుచుకుంటోంది. ★

